సాక్షి అనకాపల్లి

ఆదివారం । 26 । జనవరి । 2025

I



కనుల పండువగా ఉత్సవం

గౌరీపరమేశ్వరుల ఉత్సవం అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. పట్టణం, గవరపాలెం పురవీధులు కిక్కిరిసిపోయాయి. IIలో



ఎకో ఫ్రెండ్లీ ప్లేట్లు...

స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం విద్యార్థులు వరి గడ్డి, అరటి చెట్లతో విస్తరాకుల తయారీ ఆవిష్కరించారు. IIలో

వాతావరణం

అనకాపల్లి : రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 31.1 నుంచి 32.3 వరకూ, కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 25న 18.5, 26న 20.5, 27న 21.0, 28న 21.1, 29న 21.5 డిగ్రీలు ఉంటుందని, గాలి గంటకు 3 కిలోమీటర్లు వీస్తుందని తెలిపారు.

తాము అధికారంలోకి వస్తే గ్రామాల్లో పనిచేస్తున్న యానిమేటర్లు (వీవోఏ, బుక్ కీపర్లు) సమస్యలు పరిష్కరిస్తామని, వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా, ఎనిమిది నెలల నుంచి జీతాలు కూడా చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ యానిమేటర్లు ఆందోళన బాట పడుతున్నారు.



వెలుగు కార్యాలయంలో విధి నిర్వహణలో యానిమేటర్లు

నారా వారి హామీ నెరవేరదేమీ?

పస్తులతోనే... విధులు

లోకేష్ హామీ నెరవేర్చాలని డిమాండ్

ఎనిమిది నెలలుగా జీతాల్లేని యానిమేటర్లు

జగనన్న ప్రభుత్వంలో రూ.8వేలకు పెరిగిన వేతనం

రేపటి నుంచి ఆందోళన బాట



ఐకేపీ అధికారులకు సమ్మె నోటీసు ఇస్తున్న యానిమేటర్లు



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ ఆందోళన చేస్తున్న యానిమేటర్లు (ఫైల్)

నక్కపల్లి :

గతంలో యానిమేటర్లకు రూ.3 వేలు మాత్రమే చెల్లించే వేతనాలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.8వేలకు పెంచింది. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చారు. ఈ ఐదేళ్లపాటు పెరిగిన వేతనాలను చెల్లించేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా గత ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో యువగళం పేరుతో పాదయాత్ర చేసిన నారా లోకేష్ , అలాగే ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, గత ప్రభుత్వం ఇచ్చిన కాలపరిమితి జీవో రద్దు చేస్తామని యానిమేటర్లకు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదు. అంతేకాదు గత ఎనిమిది నెలల నుంచి జీతాలు కూడా చెల్లించడం లేదంటూ యానిమేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 ఏళ్ల నుంచి గ్రామాల్లో విధులు

గడచిన 15 ఏళ్ల నుంచి ఈ యానిమేటర్లు గ్రామాల్లో డ్వాక్రా సంఘాల్లో బుక్‌కీపర్లుగా, వీవోఏలుగా పనిచేస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రికార్డులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి డ్వాక్రా సంఘాలకు వారధిగా పనిచేస్తున్నారు. 2019 వరకు వీరంతా ప్రభుత్వం నుంచి ఎటువంటి జీత భత్యాలకు నోచుకోలేదు. కేవలం డ్వాక్రా సంఘాల దయాదాక్షిణ్యాలతో ఇచ్చే కొద్దిపాటి నగదుతోనే కుటుంబాలను నెట్టుకురావాల్సిన పరిస్థితి ఉండేది. అయినా ప్రత్యామ్నాయ ఉపాధి లేక గ్రామాల్లోనే పనిచేస్తున్నాం కదా అని సంతృప్తి పడుతూ కాలం వెళ్లదీసేవారు. మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న హయాంలో తమకు వేతనం రూపేణా నెలకు రూ.2 వేలు చెల్లించారు. తరువాత వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం వీరి వేతనాన్ని రూ.3 వేలకు పెంచింది.

8 నెలలుగా పస్తులుంటూనే..

కూటమి ప్రభుత్వం వస్తే వీరి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హామీ నెరవేర్చకపోగా ఎనిమిది నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక కష్టాలు పడుతున్నామంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జీతాలు తక్షణమే చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు రూ.10వేలకు పెంచాలని, గతంలో ఇచ్చిన మూడేళ్లకు వీవోఏలను మార్చే విధంగా ఇచ్చిన కాలపరిమితి జీవో రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వీటిని అమలు చేయాలంటూ ఈనెల 27, 28, 29 తేదీల్లో ఆందోళన చేసేందుకు సిద్ధ పడుతున్నారు. కలెక్టర్ కార్యాలయాల వద్ద సామూహిక దీక్షలు చేపట్టేందుకు నిర్ణయించారు.

గత ప్రభుత్వంలో పెరిగిన వేతనం

యానిమేటర్ల కష్టాన్ని గుర్తించి వారికి న్యాయం చేసిన ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వానిదే. పాదయాత్రలో వీరి కష్టాలను గుర్తించిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే వీరి వేతనాలను రూ.8వేలకు పెంచారు. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో సుమారు 2800 మంది యానిమేటర్లు పనిచేస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 280కి పైగా యానిమేటర్లు పనిచేస్తున్నారు. వీరినే బుక్ కీపర్లు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లుగా పిలుస్తుంటారు. పది మంది సభ్యులతో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయడం, డ్వాక్రా సంఘాలకు సంబంధించిన లావాదేవీలు చూడడం, సంఘాలకు బ్యాంకుల్లో అప్పులు ఇప్పించడం, పొదుపు ఖాతాలు తెరచి పొదుపు సొమ్ము బ్యాంకుల్లో జమ చేయడం, బ్యాంకులో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవడం వంటి విధులు నిర్వహిస్తారు. అలాగే స్త్రీనిధి పథకం ద్వారా రుణాలు ఇప్పించడం, వాయిదాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవడం, ప్రమాద బీమా ప్రీమియం వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించడం డ్వాక్రా సంఘాల వివరాలు, ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్ చేయించడం, బీమా కింద ప్రీమియం చెల్లించిన లబ్ధిదారు ఎవరైనా చనిపోతే వారి వివరాలు సంబంధిత బీమా కంపెనీకి తెలియజేసి తక్షణమే దహన ఖర్చుల కింద 24 గంటల్లోగా ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవడం, బ్యాంకుల్లో బ్యాంకుమిత్రగా వ్యవహరిస్తూ గ్రామాల నుంచి వచ్చే డ్వాక్రా మహిళలకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం, క్రమం తప్పకుండా డ్వాక్రా సంఘాల సమావేశాలు, గ్రామ ఐక్య సంఘాల సమావేశాలు నిర్వహించడం వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడం, తిరిగి చెల్లించేందుకు చర్యలు తీసుకోవడం వంటి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇవిగాక ప్రభుత్వం నిర్వహించే బహిరంగ సభలకు జనాన్ని తరలించే బాధ్యత కూడా యానిమేటర్లదే. డ్వాక్రా మహిళలను ప్రభుత్వ, పార్టీ సమావేశాలకు జనసమీకరణ చేసే బాధ్యత వీరికే అప్పగిస్తుంటారు. ఇన్ని పనులు నిర్వర్తిస్తున్నా వీరికి సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదు.

ఓటు హక్కు వజ్రాయుధం

- 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు కావాలి
- కలెక్టర్ విజయకృష్ణన్
- ఘనంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం





జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ క్రీడామైదానంలో బెలూన్ ఎగురవేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ (ఇన్‌సెట్) ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్, జేసీ, ఆర్డీవో

అనకాపల్లి : ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బెలూన్ ఎగురవేసి, జెండా ఊపి ర్యాలీని శనివారం ప్రారంభించారు. అక్కడ నుంచి పట్టణంలో నెహ్రూ చౌక్, విజయరామరాజుపేట మీదుగా గాంధీనగరం ఎస్.ఆర్.శంకరన్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఓటర్ ఓటు విలువను తెలుసుకుని వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కుద్వారా సమర్థవంతమైన పాలన సాగుతుందన్నారు. 2011లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం 15వ జాతీయ ఓటరు దినోత్సవం దేశవ్యాప్తంగా నిర్వహించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1న ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓల ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 1950కి కాల్ సెంటర్ ద్వారా ఫారం 6ఎలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. జేసీ ఎం.జాహ్నవి మాట్లాడుతూ గతంలో మండల స్థాయి అధికారులు ఓటు హక్కు నమోదు చేసేవారని, ప్రస్తుతం టెక్నాలజీ పెరిగి సెల్‌ఫోన్లో, ఆన్‌లైన్లో, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. డీఎస్ఎన్ఎల్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్యులు సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలక భూమిక పోషిస్తున్నాయని, ప్రజాస్వామ్య ప్రభుత్వానికి పునాది ఓటుహక్కు అని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటరు మాత్రమేని, పౌరుల బాధ్యతలను గుర్తుచేసి వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఏటా జనవరి 25న ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు ర్యాలీలో కోలాటం, తప్పెట గుళ్లు, దిశా డ్యాన్స్‌ను తిలకించారు. 80 సంవత్సరాలు పైబడిన నల్లల దేముళ్లును శాలువాతో సత్కరించారు. నూతన ఓటర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ అయిషా, డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారిణి, సుజాత, తహసీల్దార్ బి.విజయకుమార్, వివిధ కళాశాలల విద్యార్థులు, ఆశవర్కర్స్, ఎన్‌సీసీ విద్యార్థులు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొన్నారు.



ఎనభై ఏళ్లు పైబడిన ఓటరు నల్లల దేముళ్లును శాలువాతో సత్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ర్యాలీలో థింసా నృత్యం చేస్తున్న విద్యార్థులు

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అనకాపల్లి: కేంద్ర తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్టు అనకాపల్లి తపాలాశాఖ సూపరింటెండెంట్ డీఎస్‌యూఎన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా శాఖ డివిజన్ పరిధిలో అనకాపల్లి ప్రధాన తపాలా కార్యాలయం, కశింకోట, చోడవరం, మాకవరపాలెం, అనకాపల్లి మండలంలో తుమ్మపాల, గవరపాలెం నిదానందొడ్డి తపాలా కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

మునగపాక వాసికి అరుదైన గౌరవం

- ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన శాంతారామ్
- ఆర్‌పీఎఫ్ డీఐజీగా కోల్‌కతాలో విధులు
- ఆగస్టు 15న మెడల్ అందుకోనున్న వైనం
- నాడు తండ్రి సత్యనారాయణ విశ్రాంత ఎస్పీగా సేవలు
- తండ్రికి తగ్గ తనయుడిగా శాంతారామ్‌కు గుర్తింపు



పెంటకోట వెంకట శాంతారామ్, ఆర్‌పీఎఫ్ డీఐజీ

మునగపాక : ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరవచ్చనే నానుడిని నిజం చేస్తూ దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపికయ్యారు మునగపాక వాసి శాంతారామ్. తండ్రి అడుగు జాడల్లో పెరుగుతూ వచ్చి ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరాన్ని అధిరోహించి అందరి మన్ననలు అందుకుంటున్నారు . మునగపాకకు చెందిన స్వర్గీయ పెంటకోట సత్యనారాయణ–సత్యవతిల కుమారుడు వెంకట శాంతారామ్. సత్యనారాయణ విశ్రాంత ఎస్పీగా విశేష సేవలందించారు. తన సేవలకుగాను ఆయన రాష్ట్రపతి అవార్డును గతంలో దక్కించుకున్నారు. అలాగే ఆయన చేసిన సేవలకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పలు పురస్కారాలు అందుకున్నారు. అంతటి గుర్తింపు పొందిన సత్యనారాయణ కుమారుడు శాంతారామ్ కూడా ఇండియన్ రైల్వే సర్వీస్(ఐఆర్ఎస్)లో ఉద్యోగం సాధించారు. ఆర్‌పీఎఫ్ విభాగంలో డీఐజీగా కోల్‌కతాలో శాంతారామ్ విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే శాంతారామ్ సేవలను గుర్తించిన ఆర్‌పీఎఫ్ ఆయనను ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపిక చేసింది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ ద్వారా భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపికపత్రం అందింది. శాంతారామ్ సంబంధిత మెడల్‌ను ఈ ఏడాది ఆగస్టు 15న అందుకోనున్నారు. శాంతారామ్‌కు దక్కిన గుర్తింపు పట్ల మునగపాక ప్రజలతో పాటు కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

జిల్లా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టరు

- వైద్యురాలిపై చర్యలకు ఆదేశం



ప్రసూతి వార్డులో బాలింతలతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : ప్రజలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. స్థానిక ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం మధ్యాహ్నం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రసూతి వార్డులో చికిత్స నిమిత్తం డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుతో ఆమె ఆకస్మిక తనిఖీ చేసి, విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో రోగులు, ప్రసూతి వార్డులో బాలింతలతో నేరుగా మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బందిని విచారించారు. విచారణ అనంతరం గైనిక్ వార్డులో విధులు నిర్వహిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ సిహెచ్.శోభాదేవిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్, ఇంచార్జి డీసీహెచ్ఎస్ ఎస్.శ్రీనివాసరావును ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

టీడీపీ నేతల బరితెగింపు!

- అక్రమంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ మట్టి తరలింపు
- అడ్డుకోవడానికి వెళ్లిన ఏఈఈపై జులుం, పోలీసులపైనా దురుసు ప్రవర్తన
- అడ్డుగా నిలబడి ఒక పొక్లెయిన్‌ను పట్టుకున్న ఇంజినీర్
- పోలీసు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదు



అక్రమ మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతంలో అధికారులు స్వాధీనపర్చుకున్న పొక్లెయిన్



అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన ఏఈఈ రాజేంద్రప్రసాద్, సిబ్బంది


యలమంచిలి రూరల్ : కూటమి పాలనలో రైతులకు ఆసరాగా ఉండాల్సిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ గట్ల నుంచి పెద్ద ఎత్తున అధికార టీడీపీ నేతలు గ్రావెల్ తవ్వి పట్టుకుపోతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన పోలవరం ఇంజినీర్లపై తిరగబడుతూ జులుం ప్రదర్శిస్తున్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి వెంకటాపురం గ్రామానికి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి పోలవరం ఎడమ ప్రధాన కాల్వ వద్ద టీడీపీ నాయకుడు కనుసన్నల్లో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలను ఆపడానికి వెళ్లిన యలమంచిలి సబ్ డివిజన్–2 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.బి. రాజేంద్ర ప్రసాద్, అతనికి సహాయంగా వెళ్లిన సిబ్బందిపై తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులు దురుసుగా ప్రవర్తించారు. దౌర్జన్యంగా తన కళ్లముందే మట్టితో 4 ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను ఆ ప్రాంతం నుంచి తరలించుకుపోయారు. దీనిపై ఏఈఈ రాజేంద్ర ప్రసాద్ యలమంచిలి రూరల్ పోలీసులు, యలమంచిలి తహసీల్దార్, అనకాపల్లి గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌లకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం సంచలనం కలిగించింది. దీనికి సంబంధించిన వివరాలివి..

యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో టీడీపీకి చెందిన ఓ మాజీ వార్డు కౌన్సిలర్ దన్నుతో వెంకటాపురం సమీపంలో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్టు నుంచి ఇటీవల కొందరు అక్రమార్కులు రాత్రి సమయాల్లో మట్టి అక్రమంగా తవ్వి, రవాణా చేస్తూ తమ జేబులు నింపుకొంటున్నారు. వీరి మట్టి దందాకు యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ అధికారి పరోక్ష మద్దతు కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అక్రమ సంపాదనకు అలవాటు పడిన టీడీపీ నాయకులు ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి రెండు పొక్లెయిన్లు, పది ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తవ్వకాలను ప్రారంభించారు. ఈ సమాచారం అందుకున్న ఏఈఈ రాజేంద్ర ప్రసాద్, కార్యాలయ సిబ్బందిలో ఒకరు ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో వారికి రెండు పొక్లెయిన్‌లు, నాలుగు ట్రాక్టర్లు కనిపించాయి. వాటిని ఆపే ప్రయత్నం చేసినప్పటికీ వారు దౌర్జన్యంగా నాలుగు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను తరలించుకుపోయారు. దీంతో నిర్ఘాంతపోయిన ఏఈఈ రాజేంద్ర ప్రసాద్, కార్యాలయ ఉద్యోగి అక్కడున్న పొక్లెయిన్‌కు అడ్డుగా నిలబడాల్సి వచ్చింది. ఆ తర్వాత ఈ సమాచారాన్ని ఏఈఈ యలమంచిలి రూరల్ పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు. కొంతసేపటికి ముగ్గురు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని పొక్లెయిన్‌ను యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అధికార టీడీపీ నేతలు తమ అక్రమ వ్యవహారాలకు అడ్డు వస్తే అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డానికి కూడా వెనకాడకపోవడంతో తమకు విధి నిర్వహణ కత్తిమీద సాములా మారుతోందన్న ఆందోళనను అధికారులు వ్యక్తపరుస్తున్నారు. గృహ నిర్మాణాలు, పునాదులను ఫిల్ చేయడానికి, ఇతర పనులకు ఈ గ్రావెల్‌ను విక్రయిస్తూ రూ.లక్షలాది సంపాదిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ మట్టి తవ్వకాలతో కొన్ని చోట్ల పోలవరం కాల్వ గట్టు బలహీనపడే పరిస్థితులు కూడా నెలకొంటున్నాయి.

అనధికార తవ్వకాలపై ఫిర్యాదు

వెంకటాపురం సమీపంలో శుక్రవారం రాత్రి పోలవరం ఎడమ ప్రధాన కాల్వ గట్టు వద్ద చేపట్టిన తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని ఏఈఈ ఎల్.బి రాజేంద్ర ప్రసాద్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా తవ్వకాలు జరపడమే కాకుండా తాను వారిస్తున్నా వినకుండా తన కళ్ల ముందే బలవంతంగా నాలుగు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను తరలించుకుపోయినట్టు తెలిపారు. పొక్లెయిన్ నెంబరు ఏపీ 39ఎంయూ5677, ట్రాక్టర్ల నెంబర్లు ఏపీ35కే3025, ఏపీ39ఈబీ6080, ఏపీ 5సీకే6403, ఏపీ39ఎస్‌జే8480గా ఏఈఈ ఫిర్యాదులో పొందుపరచడం గమనార్హం. ట్రాక్టర్లను తరలించుకుపోయే సమయంలో వాటి ఫొటోలను కూడా తీసినట్టు తెలిపారు. సుమారుగా 200 క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి తరలించుకుపోయారని, దీనిపై చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకోవాలని ఏఈఈ కోరారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు



గణతంత్ర వేడుకలకు ముస్తాబైన క్రీడా మైదానం

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానాన్ని గణతంత్ర దిన వేడుకలకు శనివారం వివిధ ప్రభుత్వశాఖ అధికారులు ముస్తాబు చేశారు. ఇప్పటికే జిల్లా ఏఆర్ పోలీసులు పరేడ్ నిర్వహించారు. 10 స్టాళ్లు, 11 శకటాలకు క్రీడామైదానం ముస్తాబైంది. ఆదివారం ఉదయం 9 గంటలకు క్రీడామైదానంలో కలెక్టర్ విజయకృష్ణన్ జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మైదానంలో 8 గ్యాలరీల్లో విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు కూర్చుని గణతంత్ర వేడుకలు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు.

తెలంగాణ అథ్లెటిక్స్‌లో యలమంచిలి విద్యార్థి ఘనత



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్ : యలమంచిలి గురుజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న బీఏ విద్యార్థి ఎం.టి నారాయణ్ నాయక్ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. ఈ మేరకు శనివారం నారాయణ్ నాయక్‌ను అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు. ఇటీవల తెలంగాణలో నిర్వహించిన సీఎం కప్ అథ్లెటిక్స్ 1000 మీటర్ల పరుగుపందెంలో నారాయణ్ నాయక్ పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించగా ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.25 వేల నగదు బహుమతి అందజేసిందని తెలిపారు. విద్యార్థితో పాటు అతనికి శిక్షణ ఇచ్చిన పీడీ వై.పోలిరెడ్డిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం రూరల్ : జిల్లా ప్రజలకు తగు న్యాయ సలహాలతో పాటు, తగు న్యాయ సహాయం అందించాలన్న ఆసక్తి, ఎటువంటి గౌరవ పారితోషికాలను ఆశించకుండా పారా లీగల్ వలంటీర్లుగా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చోడవరం మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు పాస్‌పోర్టు సైజ్ ఫోటో, మరొక స్టాంప్ సైజ్ ఫొటోతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హతల జెరాక్స్ ప్రతులను జత పరచి ఈ నెల 31వ తేదీ సాయంత్రంలోగా చోడవరం కోర్టు కార్యాలయంలో అందచేయాలన్నారు. అభ్యర్థుల కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతం గానీ పారితోషికం గానీ చెల్లించరని స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ అనంతరం పారా లీగల్ వలంటీర్లుగా నియమించడం జరుగుతుందని, జిల్లాలో 25 నుంచి 50 మంది వరకు ఎంపిక చేస్తారని జిల్లా లీగల్ అధారిటీ చైర్మన్ ఆలపాటి గిరిధర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు.

చోరీకి గురైన 7 బైకుల రికవరీ


స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 7 బైకులు పట్టుబడినట్టు నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. అడ్డురోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు వాహనాలు తనిఖీ చేస్తుండగా రికార్డులు లేని రెండు బైకులను సీజ్ చేశారన్నారు. ఆ బైకులు తరలిస్తున్న వ్యక్తులను విచారించగా మరో 5 బైకుల వివరాలు తెలిశాయన్నారు. ఇందులో ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కాబడిన ఒక బైకును గుర్తించారన్నారు. బైకులు చోరీ చేసి తరలిస్తున్న వారిలో తిమ్మాపురంలో నివసిస్తున్న, పాయకరావుపేట మండలం అరట్ల కోటకు చెందిన శలంశెట్టి దుర్గాప్రసాద్, ధారకొండకు చెందిన సాయిలను అరెస్టు చేసి విచారణ చేపట్టామన్నారు. దీంతో ఏలూరు వన్‌టౌన్, నర్సీపట్నం రూరల్, నక్కపల్లి, ఎంవీపీ, గండిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బైకుల చోరీ కేసుల వివరాలు తెలిశాయన్నారు. బైకుల రికవరీకి కృషి చేసిన సీఐ, ఎస్ఐలను ఎస్పీ తుహిన్‌సిన్హా అభినందిచారన్నారు.

జెండా యాత్ర...



గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవాల్లో భాగంగా మునగపాకలో శనివారం జాతీయ జెండా ఊరేగింపు ఘనంగా జరిగింది. 300 అడుగుల పొడవైన జెండా ఊరేగింపు సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశ భక్తి ఇనుమడింప చేయాలని అన్నారు. విద్యార్థులు పఠన మందిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పఠన మందిరం సభ్యులు కోనపల్లి రామ్మోహనరావు, మారిశెట్టి అప్పారావు, బూడిద రామారావు, మొల్లేటి సత్యనారాయణ, వెలగా శ్రీనివాసరావు, దాడి అప్పలనాయుడు, ఆడారి లక్ష్మణరావు, దాడి శివ,వెలగా రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

-మునగపాక

ఓటు హక్కుపై బాలవాక్కు



రోలుగుంట మండలం జె.నాయుడుపాలెంలో ఆంగ్ల అక్షర రూపంలో ఓటర్స్ డే ఆకారంలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కనుల పండువగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం


గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు మలసాల రమణారావు


గౌరీపరమేశ్వరులను కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న డీఎస్పీ శ్రావణి

విచ్చేసిన సుమారు 3.5 లక్షల మంది భక్తులు

నేలవేషాలు, స్టేజ్ ప్రోగ్రాంలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ

అనకాపల్లి: స్థానిక **గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం అంగరంగ** వైభవంగా శనివారం **జరిగింది. పట్టణం, గవ**రపాలెం పురవీధు**లు కిక్కిరిసిపోయాయి.** ఎమ్మెల్యే కొణతా**ల రామకృష్ణ, మాజీ** ఎమ్మెల్యే పీలా **గోవింద సత్యనారాయణ,** మాజీ ఎమ్మెల్సీ బు**ద్ద నాగజగదీష్, వైఎస్సార్‌సీపీ** నియోజకవర్గ సీ**నియర్ నాయకుడు మలసాల** రమణారావు, న్యాయమూర్తులు ధర్మారావు, రమేష్, విజయలక్ష్మి, డీఎస్పీ ఎం.శ్రావణి, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు బీమరశెట్టి రామకృష్ణ అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నూకాంబిక అమ్మవారి దేవస్థానం తరఫున ఆలయ ఈవో ఎస్.సుజాత, ఉద్యోగులు అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారి రథం గవరపాలెం పురవీధుల గుండా ఊరేగించి రాత్రి 1 గంటకు రింగ్‌రోడ్డుకు చేరుకుంది. 35మంది కళాకారులచే తాంబూలం, 14 మంది కళాకారులచే నవ దుర్గవేషాలు, 16 మంది కళాకారులచే గరగలు, 11 మంది కళాకారులచే పులివేషాలు, 20మంది కళాకారులచే తీన్‌మార్ డ్రమ్స్, 16 మంది కళాకారులచే దాండియా, 10 మంది కళాకారులచే బుట్టబొమ్మలు, 40 మంది కళాకారులచే కోబ్రా డాన్స్ నిర్వహించారు. గవరపాలెం, సుంకరమెట్ట జంక్షన్ నుంచి పెరుగుబజార్ జంక్షన్ వరకూ 38 స్టేజ్‌లు ఏర్పాటు చేశారు. డ్యాన్స్‌బేబీ డ్యాన్స్‌లు, బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా డూప్ వంటి అనేక కార్యక్రమలు నిర్వహించారు. గవరపాలం సంతోషిమాత ఆర్చ్ పక్కన మందుగుండా సీతారామయ్య కుటుంబం ఆధ్వర్యంలో భారీ బాణసంచా విన్యాసాలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు..

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, విశాఖ డైరీ డైరెక్టర్ మలసాల రమణారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు రమణారావును సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, మాజీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, భోగలింగేశ్వర స్వామి దేవస్థానం మాజీ డైరెక్టర్ కాండ్రేగుల రాము, పార్టీ నాయకులు సూరిశెట్టి ఆదిబాబు, సత్తిబాబు, యల్లపు గాంధీ, **వానుపల్లి తాతయ్యలు,** పీల్లా రాజు, కాండ్రేగుల **తులసి తదితరులు పాల్గొ**న్నారు.

ఉచిత ప్రసాదాల పంపిణీ..

వెంకటన్న కొట్టు వద్ద విఘ్నేశ్వర కేళీకళా నాట్య **మండలి ఫ్యాషన్ యూత్,** వేగివారి వీధిలో సంపత్ **వినాయక, షిర్డీసాయి సేవా** సమితి, సతకంపట్టు **అమ్మవారి ఆలయం వద్ద** కీ.శే.పెంటకోట అప్పా**రావు జ్ఞాపకార్థం వారి** కుమారులు పీవీవీఎస్ నాయుడు, కొండబాబు, పీవీఆర్ డిపార్ట్‌మెంట్, దిబ్బవీధి రామాలయం వద్ద దిబ్బవీధి సీతారామ దేవస్థానం, వీధిపెద్దలు, దిబ్బవీధి రామప్పుడు షాపు వద్ద భవానీ కేటరింగ్, సుజీ జెరాక్స్ మెయిన్ రోడ్డులో కీ.శే.శరగడం సోమునాయుడు భార్య లక్ష్మి, సూరిబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూకమహాలక్ష్మినాయుడు, ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట వరప్రసాద్, సహాయ కార్యదర్శులు పి.వి.రమణ, దాడి కృష్ణ, ఉప కోశాధికారి పెంటకోట వెంకట సత్యనారాయణ, కన్వీనర్లు మద్దాల శంకరరావు, సూరిశెట్టి నరసింగరావు, ఉత్సవ కమిటీ పర్యవేక్షకులు కొణతాల మురళీకృష్ణ, కొణతాల చంద్రశేఖరరావు, కొణతాల జగ్గారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.


గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



అమ్మవారి ఉత్సవంలో సాంస్కృతిక ప్రదర్శనలు

సముద్ర తాబేళ్లను కాపాడుకోవాలి

- కీలక శాఖల సమన్వయంతో పర్యావరణ పరిరక్షణ
- తీరప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ విజయకృష్ణన్
- సంబంధిత అధికారులతో సమీక్ష



తుమ్మపాల : పర్యావరణ పరిరక్షణలో విశేష పాత్ర పోషిస్తున్న సముద్ర తాబేళ్లను కాపాడుకోవాలని అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు కార్యాలయంలో సముద్ర తాబేళ్ల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, అటవీ, మత్స్యశాఖ, కాలుష్య నియంత్రణ శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో సముద్ర తాబేళ్ల పాత్ర ఎంతో కీలకమని, వాటిని పరిరక్షించడానికి, వాటి సంతతిని పెంపొందించుటకు కృషి చేయాలన్నారు. సముద్ర తాబేళ్ల పరిరక్షణలో కీలకమైన శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. తీరప్రాంతంలో గుడ్లు పెట్టడానికి వచ్చే తాబేళ్లను పరిరక్షించడంపై తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. చేపల వేటలో తాబేళ్లకు హాని కలుగకుండా చూసేలా తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలకు, మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మత్స్యశాఖ అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. జిల్లా అటవీ అధికారి ఎం.శామ్యూల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తాబేళ్లు సుదీర్ఘ ప్రాంతం నుంచి (డిసెంబరు నుంచి మే నెల) వరకు గుడ్లు పెట్టడానికి తీరప్రాంతానికి వస్తాయని తెలిపారు. తీర ప్రాంతానికి చేరుకునే సమయంలో మర పడవలు, ట్రాలర్ల చేపల వలలో తాబేళ్లు చిక్కుకుంటాయని, వాటిని మత్స్యకారులు సురక్షితంగా మరల సముద్రంలో విడిచిపెట్టాలన్నారు. అదేవిధంగా తాబేళ్లు వలలో నుండి వెళ్లిపోయే విధంగా మత్స్యకారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి జి.లక్ష్మణ్, ఆర్డీవోలు షేక్ ఆయిషా, వి.వి.రమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్, యలమంచిలి సబ్ డివిజన్ ఫారెస్టు అధికారి ఎ.సునీల్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు జి.అనిల్ కుమార్, జ్యోతిర్మయి, మెరైన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


పురుషుల కబడ్డీలో పోటీ పడుతున్న ఆటగాళ్లు

చోడవరం: రాష్ట్రస్థాయి మహిళలు, జిల్లా పురుషుల కబడ్డీ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చోడవరం మండలం అంకుపాలెంలో శ్రీ దుర్గాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ రెండు విభాగాల్లో వేర్వేరుగా మూడు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి 13 మహిళా టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. జాతీయ స్థాయి టీమ్‌ను కూడా ఈ పోటీల్లోనే ఎంపిక చేయనుండడంతో పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. అదే విధంగా జిల్లాస్థాయిలో పురుషులకు చెందిన 30 టీమ్‌లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. దుర్గాంబిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో క్రీడాకారులను భారీ ఊరేగింపు మధ్య చోడవరం నుంచి అంకుపాలేనికి తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో పోటీలను రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రారంభించారు. ఆట ప్రారంభానికి ముందు క్రీడాకారులంతా దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, కడప, గుంటూరు, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి మహిళా జట్లు ఈ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యాయి. మొదటి రోజు గుంటూరు-కృష్ణ, విశాఖపట్నం-శ్రీకాకుళం జట్లు పోటీ పడ్డాయి. అదే విధంగా జిల్లాస్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 30 టీమ్‌లు పాల్గొన్నాయి. మొదటి రోజు మహిళా విభాగంలో రెండు మ్యాచ్‌లు, పురుషుల విభాగంలో మూడు మ్యాచ్ జరిగాయి. నువ్వానేనా అన్నట్టుగా క్రీడాకారులు తమ ప్రతిభ చూపారు. రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అఫీషియల్స్ ఈ మ్యాచ్‌లకు రిఫరీలుగా వ్యవహరించారు.

సమస్యలపై నిరసనల వెల్లువ


ఖాళీ బిందెలతో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న గిరిజనులు


తోటాడ పాలకేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న పాడిరైతులు


రాంబిల్లిలో నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ చేస్తున్న అఖిలభారత మహిళా సంఘం, ఐద్వా సంఘం సభ్యులు

రోలుగుంట: అర్ల గిరిజన పంచాయతీ శివారు పెదగరువు గిరిజనులు శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. పెదగరువు గ్రామంలో 70 మంది జనాభా ఉన్నారు. తాగు నీటి కోసం వీరు అనేక ఇక్కట్లు పడుతున్నారు. స్థానికంగా శ్రమదానంతో తవ్విన బావిలో మంచినీటికి బదులు బురద నీరు పడడంతో తప్పని పరిస్థితిల్లో ఆ నీటినే వినియోగించుకుంటున్నారు. దీంతో కొంత మంది రోగాల బారిన పడుతున్నారు. తమ కష్టాలపై దృష్టి సారించి తమ సమస్య పరిష్కరించాలంటూ శనివారం ఖాళీ బిందెలతో కలెక్టర్ విజయ కృష్ణన్‌ను వేడుకున్నారు. చేతులు జోడించి మోకాళ్లపై నిరసన తెలిపారు. దీనికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవింద సారథ్యం వహించారు.

విశాఖ డెయిరీ నిబంధనపై ఆందోళన

మునగపాక: విశాఖ డెయిరీ యాజమాన్యం వ్యవహార శైలికి నిరసనగా శనివారం తోటాడ పాలకేంద్రం ఎదుట ఆందోళనకు దిగారు. మూడు లీటర్ల కన్నా ఎక్కువ పాలు పోయరాదన్న నిబంధన సరికాదంటూ రైతులు వాపోయారు. ఈ నిర్ణయాన్ని విశాఖ డెయిరీ విరమించుకొని రైతులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. ఆందోళన చేసిన వారిలో శ్రీనివాసరావు, అప్పారావు ఉన్నారు.

నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలి

రాంబిల్లి (యలమంచిలి): నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని అఖిలభారత మహిళా సంఘం ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాంబిల్లి మండల కేంద్రంలో శనివారం అఖిల భారత మహిళా సంఘం. ఐద్వా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ధరలపై ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించాలని, రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, 16 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. రాంబిల్లి మండల కార్యదర్శి మంగతాయారు, జిల్లా నాయకులు ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

వినూత్నంగా ఎకో ఫ్రెండ్లీ ప్లేట్లు

- అరటి బోదెలు, వరి గడ్డితో ప్లేట్ల తయారీ
- వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల ఆవిష్కరణ


అరటిచెట్ల కాండం, వరి గడ్డి ద్వారా ప్లేట్ల తయారీని వివరిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం విద్యార్థులు వరి గడ్డి, అరటి చెట్లతో విస్తరాకుల తయారీ ప్రాజెక్టు వర్క్‌ను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు డి.నళిని, కె.సాయి హర్షిణి, వి.రాజ్యలక్ష్మి, ఎం.రాహుల్, కె.నరేంద్ర మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం, చైనా, ఇండోనేషియాలో అరటి సాగు ఎక్కువగా ఉందన్నారు. అరటి ఆకులు కోసిన తర్వాత అరటి మొదలును (కాండం) ప్లేట్ల తయారీకి వినియోగించడం వల్ల రైతులకు అధిక లాభం చేకూరుతుందన్నారు. ప్రాజెక్టులో భాగంగా బయో డిగ్రేటబుల్ ప్లేట్లు, క్యారీబ్యాగ్‌లు తయారు చేసినట్లు తెలిపారు. ఒక కేజీ అరటి కాండంతో 5 ప్లేట్ల వరకూ తయారు చేసుకోవచ్చని, ఒక్కో ప్లేట్ తయారీకి సుమారు రూ.2 ఖర్చు అవుతుందన్నారు.

కిలో గడ్డితో 30 ప్లేట్ల తయారీ

మనదేశంలో ప్రతి ఏడాది 47.6 మిలియన్ హెక్టర్లలో రైతులు వరిసాగు చేస్తున్నారని, వరిగడ్డి 119 మిలియన్ టన్నులు వస్తుందని, కొంతవరకు పశువులకు మేతగా, పూడిగుడిసెలకు వేయడానికి ఉపయోగిస్తారని తెలిపారు. ఏపీలో 15.12 లక్షల హెక్టర్లో విస్తీర్ణంలో వరిసాగు చేస్తున్నారని, వరిగడ్డి 37,80,000 టన్నులు వస్తుందని, కొంత మంది రైతులు వరిగడ్డిని పొలంలోనే కాల్చివేస్తున్నారని, గడ్డిని వృథా కాకుండా ప్లేట్లుగా తయారు చేసుకోవడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఎటువంటి ప్లాస్టిక్‌ను వాడకుండా వరిగడ్డి ద్వారా బయో డీగ్రేడబుల్ ప్లేట్లు తయారు చేసినట్లు తెలిపారు. ఈ ప్లేట్ భూమిలో త్వరగా కరిగిపోతుందన్నారు. ఒక ప్లేట్ తయారు చేయడానికి సుమారు రూ.2 ఖర్చు అవుతుందని తెలిపారు. ఒక కిలో గడ్డితో 30 ప్లేట్లు తయారు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.పి.కె.జగన్నాథరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కుసుమ పాల్గొన్నారు.

క్లుప్తంగా

30న అఖిల భారత యువజన జిల్లా మహాసభ

తుమ్మపాల: అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు తెలిపారు. ఎన్నికలప్పుడు కూటమి నాయకుల హామీలను అమలు దిశగా చర్యలు లేవన్నారు. మొదటి సంతకం డీఎస్సీ అంటూ ఊదరగొట్టి 8 నెలలు పూర్తవుతున్నా ఆ ఊసే లేదన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం డీఎస్సీతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



ఉత్సాహంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో 10,12 తరగతుల విద్యార్థుల వీడ్కోలు వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. వీరికి 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. బాల బాలికలు డ్యాన్స్‌లు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మానవతా విలువలు కలిగి ఉన్నత విద్యనభ్యసించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తద్వారా తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, సమాజాభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాయిబాబా తీర్థం నేడు

కశింకోట: చింతలపాలెంలో సాయిబాబా తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సాయిబాబా ఆలయ ప్రాంతంలో జరిగే తీర్థానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా హాజరవుతారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు తిరిగే రంగుల రాట్నాలు, ఆకాశ చక్రం, పిల్లల జారుడు ఫోంలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణ



కశింకోట: పుష్య మాసం ఏకాదశి పురస్కరించుకుని శనివారం స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు ప్రత్యేక అలంకరణతో భక్తులను కనువిందు చేశారు. వజ్ర కవచాలంకృతులతో పాటు పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. 108 దీపాలతో నక్షత్ర హారతి ఇచ్చారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా హాజరయ్యారు.

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజ్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
హంగ్ కాంగ్ వారియర్స్	:వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	:శ్రీసత్య
ఐడెంటీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 424 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

- ఎక్కడికక్కడే వాహనాల పార్కింగ్
- రోడ్లపై ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు

పట్టణంలో పార్కింగ్ కష్టాలు



పట్టణంలో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



పట్టణ మెయిన్‌రోడ్డులో విచ్చలవిడిగా తోపుడుబళ్లు

అనకాపల్లి: జిల్లా కేంద్రమైన తర్వాత పట్టణంలో రోజు రోజుకు వాహనదారులకు పార్కింగ్ కష్టాలు ఏర్పడుతున్నాయి. గత్యంతరం లేక షాపుల ఎదుటే వాహనాలు నిలిపి సామగ్రి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అనకాపల్లి పట్టణానికి జిల్లాలో అన్ని గ్రామాలు, మండల కేంద్రాల నుంచి వివిధ పనుల కోసం వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఇక్కడ ప్రధాన మార్కెట్, వ్యాపార, వాణిజ్య, సముదాయాలు ఉండడం రోడ్లు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్ర రూపం దాల్చింది. ఎక్కడ చూసినా వాహనాల రద్దీ, ఫుట్‌పాత్‌లపైనే వాహనాలు, తోపుడు బళ్లు, కూరగాయల వ్యాపారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు...

జిల్లా కేంద్రంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలను ఆనుకున్న రోడ్లు ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రధాన వీధుల్లో షాపుల వద్దకు వచ్చి సామగ్రి కొనుగోలు చేయాలంటే కనీసం వారి వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక రోడ్ల పక్కనే నిలుపుతున్నారు. షాపుల ఎదుట వాహనాలు నిలిపితే పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. డివిజన్ కేంద్రంగా ఉన్న సమయంలోనే ప్రజలకు ఇబ్బందిగా మారిన ట్రాఫిక్ సమస్య జిల్లా కేంద్రం అయ్యే సరికి ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి. వాహనాల తాకిడి పెరిగింది. జిల్లా స్థాయి అధికారుల వాహనాలు, ఇతర మండలాల నుంచి వచ్చిపోయే వారి వాహనాలు తాకిడి పెరగడంతో రోడ్లకు ఇరువైపులా పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఆటో స్టాండ్‌లకు అనువైన స్థలం లేకపోవడంతో రోడ్లపైనే నిలుపుతున్నారు. ఇరుకైన రహదారులు, వాటిపై నిర్వహిస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారం కారణంగా వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల పాదచారులు సైతం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుకిరువైపులా వ్యాపార, వాణిజ్య, సముదాయాలు, బ్యాంకులు ఉండడంతో పార్కింగ్ కోసం స్థలం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. నిత్యం ఈ రహదారి వెంట వేల సంఖ్యలో అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగుతున్నాయి. పట్టణ పరిధిలో సరైన పార్కింగ్ సౌకర్యం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పండగలు, సంత రోజున ఇబ్బందులు ఎక్కువ...

పండగలు, సంత రోజుల్లో ప్రధాన కూడళ్లు, మెయిన్ రోడ్డులో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. నిత్యావసర సరుకుల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి అనేక మంది ప్రజలు రాకపోకలు సాగిస్తారు. స్కూల్స్, కాలేజీలు పట్టణంలో ఎక్కువగా ఉన్నాయి. వ్యాపారులు లక్షల సంఖ్యల్లో లావాదేవీలు జరుగుతున్నాయి. పట్టణ పరిధిలో మెయిన్‌రోడ్డు గుండా ట్రాఫిక్ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది.



పట్టణంలో వాహనాల పార్కింగ్

పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి...



జిల్లా కేంద్రంలో పార్కింగ్ స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణంలో వస్తువులు కొనుగోలు చేయాలంటే రోడ్డు పక్కనే వాహనాలను నిలిపాల్సి వస్తోంది. పార్కింగ్ కోసం అనువైన స్థలాలను ఏర్పాటు చేయాలి.
– వాసుపల్లి తాతలు, అనకాపల్లి పట్టణం

రోడ్డుపైనే తోపుడు బళ్లు



ప్రధాన కూడళ్లలో రోడ్లపైనే తోపుడుబళ్లతో వ్యాపారం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారుల దృష్టి సారించి రోడ్లపై తోపుడు బళ్లు, రహదారి వ్యాపారాలు తొలగించాలి.
– వెంకటేశ్వరరావు, తుమ్మపాల గ్రామం అనకాపల్లి మండలం

సమాజానికి మంచిని చేకూర్చే నాటికలు రావాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



నాటిక ప్రదర్శనను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



విడాకులు కావాలి నాటికలోని సన్నివేశం

మునగపాక: మునగపాక సంతబయిల గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విడాకులు కావాలి నాటిక ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. నటీనటులు మెరుగైన ప్రదర్శన ఇచ్చారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ వారు ప్రదర్శన నిర్వహించారు. ఈ నాటికకు పొత్తూరు విజయలక్ష్మి మూల కథ అందించగా విల్లూరి శివప్రసాద్ నాటకీకరణ చేశారు. గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.నాటిక ప్రదర్శనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మంచి చేకూర్చే నాటికలు రావాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారులను ప్రోత్సహించేందుకు గౌతమ పఠన మందిరం నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, మారిశెట్టి అప్పారావు, వెలగా శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, దాడి శివ, మోహనరావు, మళ్ల సంజీవరావు, సూరిశెట్టి సుధారాణి, కుంది సూర్యనారాయణ, ఆడారి పరశురామ్, ఆడారి లక్ష్మణరావు, విల్లూరి నూక నరసింగరావు, ఆడారి సన్యాసిరావు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న సంఘం వ్యవస్థాపకురాలు గూడురు సీతామహాలక్ష్మి

పెందుర్తి: చింతల అగ్రహారం, జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు లీలా గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవయవదానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్ బాబు,గ్రామ పెద్దలు, అఖిల భారత శరీర మరియు అవయవ దాతల సంఘం సభ్యులు కె.వెంకట్ కృష్ణ ,వై.నగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకులు గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తాను ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సమయంలో పిల్లలకు సాంఘిక శాస్త్రంలో పాఠాలు చెబుతుంటే కలిగే ఆనందం ఈ రోజు అవయవ దానంపై అవగాహనపై కల్పిస్తుంటే కలిగిందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం నేత లీలా గంగాధర్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి బిల్ కలెక్టర్ మృతి



మృతి చెందిన సత్యనారాయణ(ఫైల్)

పెందుర్తి: తమ ప్లాట్‌లోని బాల్కనీలో విద్యుత్ బల్బ్ మారుస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అప్పన్నపాలెం సమీపంలోని బాలాజీ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో శనివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలివి.. జీవీఎంసీ 94వ వార్డు వెంకటాపురం ప్రాంతంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న దాడి వెంకట సత్యనారాయణ (47) బాలాజీ హైట్స్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం విధులకు వెళ్లిన సత్యనారాయణ మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి వచ్చాడు. భోజనం అనంతరం బాల్కనీలో పోయిన బల్బ్ మార్చేందుకు గోడ ఎక్కాడు. గోడ మీద నుంచి కాలు జారడంతో మొదటి ఫ్లోర్ నుంచి కింద పడిపోయాడు. తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో సత్యనారాయణను గోపాలపట్నంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మరణించాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరితాత దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పద్ధతులతో బోధన అవసరం

సబ్బవరం: సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మండలంలోని ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణా కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు అంతా పాల్గొన్నారు. పాఠశాలలో చదివే 1, 2వ తరగతుల చిన్నారులకు నూతన పద్ధతుల ద్వారా బోధనపై అవగాహన కల్పించారు. శిక్షణ ఇచ్చిన 15 మంది రిసోర్స్ పర్సన్లకు సబ్బవ రం మండల ఉపాధ్యాయులంతా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లెక్కల హేమంత్ సుదేవ్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఆరు వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని వాటికి స్మార్ట్ టీవీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు నామాల శ్యామల, మాధురి, అనిత, పీవీ చాముండేశ్వరి పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

కశింకోట: మండలంలోని స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థల్లో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను రంగు కాగితాలు, జెండాలతో అలంకరించారు. అలాగే పాఠశాలలను కూడా శుభ్రం చేసి అలంకరించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జాతీయ పతాకాలను ఎగుర వేయడానికి ఏర్పాట్లు చేశారు.

ఆర్ఏఆర్ఎస్‌లో ఒడిశా రైతులకు ముగిసిన శిక్షణ



బెల్లం తయారు విధానాన్ని ఒడిశా రైతులకు వివరిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త జగన్నాథరావు

అనకాపల్లి : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకూ ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ జిల్లాకు చెందిన 20 మంది రైతులుకు ఆర్ఏఆర్ఎస్‌లోను, జిల్లాలో చెరకు పంటలు పండించే విధానంపై శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసిందని పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞాన విభాగం ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు చెప్పారు. 20 మంది రైతులకు ఆర్ఏఆర్ఎస్‌లో బయోమెస్ గ్యాస్ ఫైర్ ద్వారా బెల్లం తయారు చేసే విధానాన్ని వివరించారు. తక్కువ ఖర్చు, సమయంతో బెల్లం తయారు చేస్తూ రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో పరిజ్ఞాన విభాగం శాస్త్రవేత్త పి.శ్రీదేవి, ఇంజినీర్ జి.కుసుమ, చెరకు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, ఒడిశా రైతులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సినీ నటుడు శ్రీకాంత్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న శ్రీకాంత్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం సినీ నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభానికి మొక్కుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

'పీఎం సూర్యఘర్'తో విద్యుత్ ఆదా

పరవాడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని వినియోగించుకొని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై మరిడిమాంబ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గృహ వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకం కోసం దరఖాస్తులు చేసుకొన్న వినియోగదారులకు రాయితీతో సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మిస్తామన్నా రు. వివిధ బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా కల్పిస్తాయని చెప్పారు. ఇంటి పై కప్పుపై 10 చదరపు మీటర్ల స్థలాన్ని సమకూర్చడం ద్వారా ఒక కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్ ద్వారా 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం వినియోగదారుడికి రూ.1000 బిల్లు వస్తే సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు తరువాత రూ.338 బిల్లు వస్తుందని తద్వారా ఏడాదికి రూ.8 వేలు ఆదా అవుతుందన్నారు. పథకం పై గ్రామీణ ప్రాంత విద్యుత్ వినియోగదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. సదస్సులో ఏడీ బి.కనకారావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయుడు పాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య పాల్గొన్నారు.

పెరుగు బజార్ రోడ్డు పనులు ప్రారంభించాలి



పెరుగుబజార్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక సభ్యులు

తుమ్మపాల: పట్టణంలో అర్థాంతరంగా నిలిచిపోయిన పెరుగు బజారు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలువురు శనివారం నిరసన తెలిపారు. గత ప్రభుత్వం మొదలుపెట్టిన రోడ్డు విస్తరణలో 60 అడుగుల వెడల్పు చేస్తూ భవనాలు తొలగించారని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని, దాదాపు 8 నెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కాలేదని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిన్ని యాదవ్, శ్రీ నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు అన్నారు. రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రైనేజీ నిర్మాణం కూడా పూర్తి చేశారన్నారు. కూటమి నాయకులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా గోతులమయంగా ఉన్న రోడ్డులో ప్రజలు రాకపోకలు సాగించలేకపోతున్నారన్నారు. భవనాలు కోల్పోయిన కొంత మంది టీడీఎస్ చెల్లింపుదారులతో అధికార పార్టీ నాయకులు, అధికారులు చర్చించి వారికి టీడీఎస్ చెల్లించి సంపూర్ణమైన సిమెంట్ రోడ్డు నిర్మాణం యుద్ధ ప్రాతిపదన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, జిల్లా కార్య నిర్వహణ అధ్యక్షుడు సూదికొండ మాణిక్యాలరావు, ఆర్యవైశ్యుల సంఘం నాయకులు బొద్దు సోమరాజు, మత్స్యకారుల సంఘం నాయకులు వాసుపల్లి తాతయ్యలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజు, నటభూషణ్ శోభన్‌బాబు సేవా సంస్థ చైర్మన్ ముగడ అప్పారావు, యాదవ సంక్షేమ సంఘం నాయకులు పల్లా సత్యఅప్పారావు, స్థానిక షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



చింతామణి గణపతి దత్తక్షేత్రంలో సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న దంపతులు



భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న మైసూర్ దత్త విజయానందతీర్థ స్వామీజీ

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో శనివారం 800 మంది దంపతులచే సత్యనారాయణస్వామి వ్రతాన్ని మైసూర్ దత్తక్షేత్ర అవధూత దత్త విజయానంద తీర్థ స్వామీజీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ స్వామి వ్రతం చేయించుకున్న భక్తులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వ్రతం అనంతరం భక్తులకు స్వామివారు ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం దత్తక్షేత్రం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం కూర్మన్నపాలేనికి చెందిన నృత్యనికేతన్ డ్యాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీచక్రపూజ నిర్వహించారు. దత్తక్షేత్రం నిర్వాహకులు ఆంజనేయరాజు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ



గవరపేటలో పిల్లలను పరీక్షిస్తున్న వైద్యాధికారి యశోద



బీపీ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



అబా ఆరోగ్య కార్డుల కోసం డేటా సేకరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ

కశింకోట: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక గవరపేటలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 74 మందికి వైద్య సేవలందించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లపై మహిళలకు అవగాహన కలిగించారు. వీటిపై ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఎన్‌సీడీసీడీ (నాన్ కమ్యూనికేబుల్ అండ్ కమ్యూనికేబుల్ డిజార్డర్స్) సర్వే నిర్వహణలో భాగంగా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి బీపీ, సుగర్, ఇతర వ్యాధులకు సిబ్బంది పరీక్షలు చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే అబా ఆరోగ్య కార్డుల కోసం డేటాను సేకరించారు. 42 మంది వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌పీహెచ్ దుర్గ, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'జంప్ డిపాజిట్ స్కాం'పై అప్రమత్తం

కశింకోట: సైబర్ మోసాల్లో భాగంగా కొత్తగా వచ్చిన 'జంప్ డిపాజిట్ స్కాం' పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. దీనిలో ముందుగా బ్యాంకు నుంచి నగదు వచ్చినట్లు సెల్‌ఫోన్‌లో మెసేజ్ వస్తుందన్నారు. దాన్ని చూసి ఫోన్ పే, గూగుల్ పే యాప్‌లు తెరచి నగదు చూడటానికి ప్రయత్నిస్తే పైన మెనూలో పే రిక్వెస్టు వస్తుందన్నారు. దానిలో ఎమౌంట్ కూడా ఉంటుందన్నారు. అది ఎక్కడి నుంచి వచ్చిందో పరిశీలించడం కోసం పిన్ నమోదు చేస్తే అది తప్పుడు ఖాతాలోకి దానికదే వెళ్లిపోతుందన్నారు. దీన్ని జంప్ డిపాజిట్ స్కాంగా పేర్కొంటారన్నారు. ఇటువంటి స్కాం నుంచి ప్రజలు రక్షణ పొందడానికి సెల్‌లో వచ్చిన తప్పుడు మెసెజ్‌ను 30 నిమిషాల పాటు చూడరాదన్నారు. లేదంటే పిన్ నమోదు తప్పుగా చేసినా ఆ రిక్వెస్టు రద్దు అవుతుందన్నారు. ప్రజలు ఈ అంశాలు పాటించి ఈ స్కాం బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

జీవాలకు వైద్య పరీక్షలు



పోస్టర్లు ప్రదర్శిస్తున్న పశు వైద్యాధికారి దయానా

కశింకోట: పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో శనివారం పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 300 గొర్రెలు, మేకలు, 30 లేగ దూడలు, 15 పెద్ద పశువులకు నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. 12 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. 25 కోళ్లకు మందులు అందించారు. పశు ఆరోగ్య శిబిరాలపై అవగాహన కలిగిస్తూ రూపొందించిన పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళి, బీజేపీ నాయకుడు గల్లా రాజు, జనసేన నాయకుడు కర్రి సత్యనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది రమేష్, ఈశ్వరరావు, పశు వైద్య సిబ్బంది సన్యాసిరావు, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.